పారదర్శక ఓటరు జాబితాకు సహకరించాలి


వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ

అంబర్‌పేట్: ఓటర్ల జాబితాపై ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారూతీదివాకర్ వివిధ రాజకీయ పక్షాల నేతలను కోరారు. శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల పై సర్కిల్ కార్యాలయంలో ఆయన వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ఓటర్ జాబితా రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. పారదర్శకమైన ఓటర్ జాబితా రూపొందించేందుకు సహకరించాలని డీఎంసీ కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలా వెంకటేష్

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఈ నెల 13, 14వ తేదీల్లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా, ఆందోళన కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి వందలాదిగా బీసీలు తరలివెళ్లి పూర్తిస్థాయిలో విజయవంతం చేశారని ఆయన అన్నారు. ఢిల్లీలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని నగరానికి చేరుకున్న సందర్భంగా శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద బీసీ సంఘాల, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఉద్యమం కొనసాగుతుందన్నారు. ముదిరాజ్ ఐక్యవేదిక అధ్యక్షుడు జి.అనంతయ్య, విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ శివకృష్ణ, యాదవ సంఘం అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, రజక సంఘం రాష్ట్ర నాయకులు గణేష్, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు కోనూరు గణేష్ గౌడ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని సహించం


డీడీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం.. సమస్యల పరిష్కరించే విషయంలో అధికారుల అలసత్వాన్ని సహించమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వరమే స్పందించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాలోత్సవం విజయవంతం.. కేవీ రమణాచారికి అభినందన


కేవీ రమణాచారిని అభినందిస్తున్న బాలోత్సవం కమిటీ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల జాతర కార్యక్రమం విజయవంతం అయినందుకు బాలోత్సవ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు కె.వి.రమణాచారిని శుక్రవారం తెలంగాణ బాలోత్సవ కమిటీ సభ్యులు కలిసి మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య మాట్లాడుతూ... బాలోత్సవ పిల్లల జాతరలో 112 పాఠశాలలకు చెందిన ఆరు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇది విద్యార్థుల చైతన్యానికి గొప్ప నిదర్శనమన్నారు. కార్యక్రమానికి సహకరించిన పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. 2024లో జరగబోయే పిల్లల జాతరకు ఇలాగే సహకారం అందించాలని వారు కోరారు. బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు కె.సుజావతి, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందనగర్‌లో ఇళ్లను కూల్చొద్దని వినతి


ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న బస్తీవాసులు

చిక్కడపల్లి: స్వామి వివేకానందనగర్‌లో ఇళ్లను కూల్చకుండా చూడాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు బస్తీవాసులు శుక్రవారం సాయంత్రం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బస్తీ అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి ఎం.బి.కృష్ణ మాట్లాడుతూ... దశాబ్దాలుగా బస్తీలో నివాసం ఉంటున్నామన్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నామని, ఇంటి పన్ను, విద్యుత్, వాటర్ బిల్లులను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామన్నారు. వారం రోజులుగా జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు ఇళ్లు కూల్చివేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పేదలమైన తమకు ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల స్థలాన్ని చూపించాలని కోరారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ సానుకూలంగా స్పందించారని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బస్తీవాసులకు న్యాయం చేస్తానని చెప్పారన్నారు. నేతలు జాన్, రాజయ్య, ఎర్రం శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సుస్వర లయబద్ధం.. కన్నారావు గళం


కన్నారావును సత్కరిస్తున్న అతిథులు

చిక్కడపల్లి: కన్నారావు గళం సుస్వరలయబద్ధం అని ఆయన గానం ఘంటసాల పాటలను మరిపిస్తుందని ప్రముఖులు పేర్కొన్నారు. ప్రముఖ మహిళా సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో ప్రముఖ గాయకుడు డాక్టర్ అమలాపురం కన్నారావుకు ఆత్మీయ సత్కారం, ప్రముఖ ఘనాఘన గాయక పేరిట ఘంటసాల సినీ యుగళ గీత విభావరి జరిగింది. ప్రముఖ ఘనగాయక పేరిట ఘంటసాల సినీ యుగళ గీత విభావరి జరిగింది. ప్రముఖ గాయని రమణకుమారి, అంబాదాస్, మోహన్‌కృష్ణ, చంద్రశేఖర్, వేణు గోపాల్, కనక శైలజ, లలిత, రాజశ్రీ తదితరులు ఘంటసాల, సుశీల, జిక్కి, జానకిలతో కలసి పాడిన పాటలు మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దూరదర్శన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు పాల్గొని కన్నారావును సత్కరించి మాట్లాడారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ఏ గ్రేడ్ కళాకారునిగా ప్రఖ్యాత నాట్యగురువు శోభానాయుడు నృత్య రూపకాలకు గాన సహకారం అందించి రూపకాలను రక్తికట్టించారని వివరించారు. దక్షిణ మధ్య రైల్వే మాజీ సీజీఎం రామకృష్ణ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా కన్నారావు వివిధ వేదికలపై ఘంటసాల పాటలు పాడి తెలుగువారిని అలరిస్తున్నారన్నారు. సంగీత కళాకారుడు పాలగుమ్మి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- ఫ్లైఓవర్ నిర్మాణంతో వాహనదారులకు నరకయాతనే
- ప్రత్యామ్నాయ రోడ్లలో సమస్యలను పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- కనీస ప్రణాళిక లేకుండా డివైడర్లు, యూటర్న్‌ల ఏర్పాటుపై సర్వత్రా నిరసన



అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ట్రాఫిక్ ఇలా...

అంబర్‌పేట: అంబర్‌పేట ప్రధాన రోడ్లతో పాటు ప్రత్యామ్నాయ రోడ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉండటంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. పట్టించుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు ఫ్లైఓవర్ నిర్మాణం కారణాన్ని చూపుతూ ట్రాఫిక్ సమస్యను పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అంబర్‌పేట్ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతునే ఉన్నాయి. పరిష్కారానికి అవకాశం ఉన్నా ట్రాఫిక్ అధికారులు కనీసం దృష్టి సారించకపోవడం శోచనీయం. ఆయా చౌరస్తాల్లో వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకొని వారంతాట వారే బయటపడాల్సిన పరిస్థితులు అంబర్‌పేట్‌లో నిత్య కృత్యం అయ్యాయి.

ఇక్కడే ఎక్కువ ట్రాఫిక్ ఇక్కట్లు...

అంబర్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెడ్ బిల్డింగ్ చౌరస్తా, పాప్పజిదాబా చౌరస్తా, జిందాతిలిస్మాత్ చౌరస్తా, అలీకేఫ్ చౌరస్తా,



తహసీల్దార్ కార్యాలయం చౌరస్తా, శివం రోడ్ సాయిబాబా ఆలయం లైన్ చౌరస్తా ప్రాంతాల్లో నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. శ్రీరమణ థియేటర్ చౌరస్తా నుంచి ఛే నంబర్ చౌరస్తా ప్రధాన రోడ్ మూసివేయడంతో ప్రత్యామ్నాయా మార్గాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలం అయింది. ప్రత్యామ్నాయా రోడ్లలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు విఫలం అవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నామ్‌కే వాస్తీగా ట్రాఫిక్ సిబ్బందిని కొద్దిసేపు నియమించి అనంతరం పత్తా లేకుండా పోతున్నారు. ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కనీస ప్రణాళిక లేకుండా యూటర్న్‌లు...

అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం, జిందాతిలిస్మాత్ రోడ్‌లలో అస్తవ్యస్తంగా యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఒక యూటర్న్‌ను మూసివేసి ఒకే యూటర్న్ ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తెరిచి ఉన్న యూటర్న్ ఎదురుగా ఓ హోటల్ ఉండటం, అక్కడ అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్‌తో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోజుకు ఓ ప్రమాదం జరుగుతోంది. వాహనదారుల వాగ్వాదంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు.

నియామకం


శివసాయి తేజ

కాచిగూడ: దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్‌గా సి.హెచ్.శివ సాయితేజ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ శుక్రవారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు అందజేశారు. పార్టీ నేతలు ఇటికాల గణేష్, రాంచందర్, కరుణాకర్, నిహార్, విజయ్, రాజేశ్వర్ తదతరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి



కాచిగూడ: గర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వే స్టేషన్ గేట్ నెంబర్ 1 వద్ద ఓ గుర్తుతెలియని వృద్ధురాలు(70) అనారోగ్యంతో మృతి చెంది ఉంది. మృతురాలు భిక్షాటన చేసుకుంటుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతిచెందిన లక్ష్మీపతి గౌడ్

అంబర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అశోక్ సమాచారం మేరకు.. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో ముత్తయ్య కుమారుడు లక్ష్మీపతి గౌడ్(44) స్థానికంగా వ్యాపారి. గురువారం రాత్రి పుట్టింటికి వెళ్లిన భార్యతో ఫోన్‌లో మాట్లాడి ఇంట్లో ఒంటరిగా నిద్రపోయాడు. శుక్రవారం మధ్యాహ్నం వంట గ్యాస్ డెలివరీ బాయ్ వచ్చాడు. లక్ష్మీపతి నివసించే ఇంటి తలుపుతట్టినా స్పందన లేదు. అంతస్తులో ఉన్న వారికి చెప్పడంతో వారు కూడా తలుపు తట్టినా స్పందన రాకపోవడంతో కిటికీ తెరిచి చూడగా లక్ష్మీపతిగౌడ్ అచేతనంగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తలుపులు విరగ్గొట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెండికి బంగారు కోటింగ్ ఇచ్చి బ్యాంకు రుణం: వ్యక్తిపై కేసు

కాచిగూడ: వెండి ఆభరణాలకు బంగారు కోటింగ్ ఇచ్చి అక్రమంగా బ్యాంకు నుంచి రుణం పొందిన వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫ్‌నగర్ కు చెందిన క్రాంతి కుమార్ (40) గత జూలై నెలలో బర్కత్‌పురలోని ఇండియన్ బ్యాంక్‌లో వెండి ఆభరణాలకు బంగారు కోటింగ్ ఇచ్చి బంగారు ఆభరణాలని నమ్మించి రూ. 4,40 లక్షల రుణం పొందాడు. శుక్రవారం బ్యాంక్ అధికారులు ఆడిటింగ్ నిర్వహించగా బంగారం కాదు వెండి ఆభరణాలుగా నిర్ధారించారు. దీనిపై ఇండియన్ బ్యాంక్ మేనేజర్ అవినాష్ మానస్ కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రాంతికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

కార్మికుల పక్షానే ఎర్ర జెండా


వీఎస్‌టీలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సత్కరిస్తున్న నాయకులు

- కార్మిక హక్కుల సంరక్షణకు అవిశ్రాంత పోరు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్మికుల పక్షానే ఎర్ర జెండా ఉంటుందని, వారి హక్కుల సాధనకై అవిశ్రాంతంగా పోరాడుతుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సాంబశివరావు సన్మాన సభ శుక్రవారం వీఎస్‌టీలోని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగింది. అంతకు ముందు విద్యానగర్ చౌరస్తాలో వందలాది మంది ఆర్టీసీ కార్మికులు సాంబశివరావుకు స్వాగతం పలికి యూనియన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సాంబశివరావుకు శాలువా, పూలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమ్మెలు, ధర్నాలు, ర్యాలీలను నిషేధించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించివేసిందని మండిపడ్డారు. నియంతృత్వ వైఖరితో కార్మికుల హక్కులను కాలరాసిన ఏ ప్రభుత్వం కూడా మనుగడను సాగించలేదని కూనంనేని స్పష్టం చేశారు. అందుకే బీఆర్‌ఎస్‌ను కార్మికులు, ప్రజలు చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.వెంకటేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఇ.వెంకన్న, ఉపప్రధాన కార్యదర్శి ఎం.డి.అహ్మద్‌అలీ, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రోడ్స్, ట్రాన్స్‌పోర్ట్స్ వర్కర్స్ ఉప ప్రధాన కార్యదర్శి కె.పద్మాకర్, ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వి.ఎస్.బోస్, ఉపాధ్యక్షులు అరుణకుమారి, కార్యదర్శులు కె.ఎస్.రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి


నివాళులర్పిస్తున్న జస్టిస్ రామలింగేశ్వర్‌రావు తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కిన్నెర చిత్ర హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రదర్శించిన అమరజీవి పొట్టి శ్రీరాములు టెలిఫిల్మ్ ఆకట్టుకునేలా సాగింది. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు చేసిన దీక్షను కొనియాడారు. కార్యక్రమంలో అతిథులుగా ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ రావు, ఏపీ శాసన సభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బొద్దులూరి రామారావు, డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, నిర్మాత మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన



బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాలలో శుక్రవారం జియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఎన్ ఇంటర్ డిసిప్లనరీ అప్రోచెస్ ఆఫ్ జియో సైన్సెస్' పేరుతో రోజు సదస్సు నిర్వహించారు. ఇంటర్నేషనల్ కన్సల్టెంట్ ఆన్ క్లైమేట్ చేంజ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సాయి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి పర్యావరణ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉమా మహేశ్వర్ రెడ్డి, సైఫాబాద్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మణ్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, కన్వీనర్ డాక్టర్ సి.హెచ్.వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇలాంట సదస్సులు నిర్వహించడం అభినందనీయమని వక్తలు అభిప్రాం వ్యక్తం చేశారు. దీనివల్ల జియాలజీ ప్రాముఖ్యత, నైపుణ్యాలు, అవకాశాల గురించి విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. విద్యార్థులకు భవిష్యత్తు అవకాశాలతో పాటు విశ్లేషణ, నైపుణ్యం పరిశోధన ప్రాముఖ్యత అర్థం అవుతుందన్నారు.

పద్మశాలీలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను అభినందిస్తున్న పద్మశాలీ సంఘం నేతలు

కాచిగూడ: పద్మశాలీలకు అండగా ఉంటూ వారి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఎమ్మెల్యేగా రెండోసారి భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే కాలేరును పద్మశాలీ సంఘం అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షుడు వర్కాల కృష్ణ నేతృత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. పద్మశాలీ సంఘం నేతలు చిలక శివకుమార్, భీమనపల్లి అశోక్, ఎనుగంటి నరేందర్, ఎ.అంజయ్య, కుందెన సత్యనారాయణ, గంగిశెట్టి సత్తయ్య, గంధమల్ల శ్రీనివాస్, గంగిశెట్టి మల్లేష్, తీగల నరేందర్, ఆవుల రాములు, సక్క రమేష్, పెద్దబొమ్మ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి


మంత్రి సీతక్కను అభినందిస్తున్న యూబీఐడీఈఎఫ్ ప్రతినిధులు

చిక్కడపల్లి: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (యూబీఐడీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రిని కలిసిన ఫెడరేషన్ ప్రతినిధులు ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ కార్యదర్శి పి.రాజశేఖర్, ఉపాధ్యక్షులు ఆర్.స్వామినాయక్, మహేష్, వినోద్, ప్రమేద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కల్లు గీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కె.హనుమాండ్లు గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. యూనియన్ నేతలు లింగాల గోవర్ధన్ గౌడ్, నర్సింహాగౌడ్, భిక్షపతి గౌడ్, కృష్ణాగౌడ్, బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: భోలక్‌పూర్ రంగానగర్‌లో ఉన్న నల్లపోచమ్మ ఆలయ 27వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ సంఘ సేవకుడు పాటిల్ కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ కృష్ణయాదవ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పాటిల్ సాయి, రుక్మిణి, రాజేశ్వరి, ఆలయ కమిటీ నిర్వాహకులు శేఖర్, మల్లేష్, సుమన్, భీమ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మోతీమార్కెట్‌లో మట్టి కుప్పలను తొలగించండి


మట్టికుప్పలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: మోతీమార్కెట్ లేమన్ సత్తయ్య లేన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు నిర్మాణపు పనుల అనంతరం మట్టికుప్పలను తొలగించపోవడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం స్థానికులు సమస్యను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు. మోతీమార్కెట్‌లో పేరుకుపోయిన మట్టి కుప్పలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. నేతలు సుభాష్ పటేల్, మల్లికార్జున్, బాలప్రసాద్, సాయి, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్ పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు హెబ్రోన్ చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు



చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తాలోని సుప్రసిద్ధ హెబ్రోన్ చర్చి క్రిస్మస్ సంబరాలకు ముస్తాబవుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం చర్చిలో చైర్మన్ జోసఫ్ పి.కురియన్, ప్రధాన కార్యదర్శి రాగి పీతారచారి చర్చించారు. పూనేకు చెందిన దైవ సేవకులు చోహన్ ప్రత్యేక అతిథిగా హాజరై దైవ సందేశాన్ని అందిస్తారని వారు తెలిపారు. హెబ్రోన్, హెర్మోన్ ప్రాంగణాల్లో వేలాది మంది ప్రార్థనలు చేయడానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వివరించారు

రైలు పట్టాలపై పడుకొని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు పట్టాలపై పడుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... జామై ఉస్మానియా–విద్యానగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (40) పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై నీలి రంగు ఫుల్ షర్టు, అదే రంగు జీన్స్ ప్యాంట్ ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.